లేవు. ఆ పిల్లకాయలు లేరు. దేవుడుగుడి అలాగేవుంది. చెరువులో తెల్లుగడ్డినీరు అలాగేవుంది. చెరువుగట్టున ఒక నున్నని వరి కళ్ళంవుంది.

నేనూ తిరిగి చూస్తిగదా చిన్నపిల్లలంతా ఎదిగినట్టు గోచరించారు. కాని ఆ ఆటలల్లాగే నిలచివున్నాయి.

.... .... .... .... ....

# గంటల బళ్లు

నే వ్రాస్తూవున్నది ఏ ముప్పయ్యేళ్ళనాటి మాటో! బస్సులులేని రోజులు. కార్లు సకృత. పల్లెటూరుకు పల్లెటూరుకు నడకమీదగాని, బండ్లమీదగాని వెళ్ళేవారు. అందులోను మెరకపూళ్ళు అవి అయితే మోటబళ్ళే మార్గం. రైలుగట్టు ఒక కొన్ని గ్రామాలను కొన్ని పట్నాలను కలిపింది కాని మిగతా గ్రామాలన్ని రైలెఱుగనివే! అలా అని ఆ గ్రామాలు సంస్కృతిలోను, వ్యవసాయంలోను ఏమీ తీసిపోయేవికావు. పట్నవాసపు టుద్యోగస్థులుకూడా సదుపాయంకోసం పల్లెటూళ్ళంటే కమానువెళ్ళేవారు. వారికి మేనాసవారీలు ఏర్పాటుచేసేవారు. ఒక్కొక్కప్పుడు రెండెడ్లబండిలో గడుకొయ్యఎత్తున వట్టిగడ్డిపఱచి, అందుమీద కంబళీయో పరుపో వేసి రెండుపెక్కాలు పడేసేవారు. ఎడ్ల కొమ్ములకు ఇత్తడి తొడుగులుండేవి. వాటి మెడలలో గంటలో లొడుగులో యుండేవి. కొన్నియెడ్లకు మువ్వలుండేవి. బండి తోలేవాడు సామేదాగా వట్టిగడ్డివేసుకు తొట్టిలో కూర్చునేవాడు. తోలేవాడే కాదు. ఎడ్లబండీ దానంతటదే నడిచేది. అలాంటిబళ్ళే కనపడవు ఇప్పుడెక్కడా!

అయితే ఒకప్పుడు వెళ్ళిన హుషారు మరొకప్పుడు లేదు. ఆ ఒక్కసారి సవారిబళ్ళమీద సరదా అనిపించింది. ఏ ఒక్కసారి అని అంటారేమో పాఠకులు ?—

మేం అంతా మగపెళ్ళివారం. మా పినతండ్రి కొడుకు పెళ్ళిఅయింది విరవాడలో. మేమంతా ఆ పల్లెటూరు తలోవూరు నుంచి పెళ్ళికివచ్చాం కాని వెళ్ళేటప్పుడు అంతా కలిసి మా వూరు శ్రీరంగపట్నం తిరుగవెళ్ళేం. ఆ వెళ్ళేటప్పుడు అయిదురోజులు పెళ్ళికుండి విరవాడలో రెండెడ్లబళ్ళమీద ప్రయాణమైనాం. రెండెడ్లబళ్లు ఎక్కడనుంచి వచ్చాయంటారేమో ? శ్రీరంగపట్నం నుంచి వచ్చేటప్పుడు బండికొకరు చొప్పున వచ్చారు. వెళ్ళే టప్పుడు బండికి పదిమంది చొప్పున కూర్చున్నారు ఆడపెళ్ళి వారు, మగపెళ్ళివారు, వాళ్ళవాళ్ళ బంధుగులు కొందరు యావ న్మందీ ఒక వందమందిదాకా ప్రయాణమైనారు, మీ రెక్కండి అంటే మీరెక్కండి అంటూ వారంతా ఆ రెండెడ్లబళ్ళు ఎక్కే వాళ్ళలాగు కనిపించారు. కనిపించడమేమిటి ? ఎక్కారు !

బళ్ళు నల్లచెరువు సత్రవు చేరుకునేసరికి ఒక జాము పొద్దెక్కింది. ఒక జాము పొద్దెక్కింది అంటే ఏమన్నమాట ? విరవాడలో ఏ రాత్రో బళ్లుకట్టామన్నమాట !

నల్లచెరువు సత్రము పెద్దసత్రము. మేం వంటలవీ చేసు కునేసరికి బళ్ళవాళ్లు తినేసరికి ఏ మూడు జాములో అయింది. అపరాహ్ణం. కాలం వేసవికాలం. నిప్పచ్చరంగా బాటపడి కంటి అయ్యన్న చెరువు అంతా ఎండిపోయింది. ఆ చెరువు అడ్డముడి ఎంతసేపు వెళ్ళడమనుకుంటూ బళ్లు కట్టాము. మువ్వలు గంటలు కట్టి కొన్నిటికి తలవెండ్రుకలతో అల్లిన తాళ్లువేశాము. ఆడపెళ్ళి

వారినుంచి తీసుకున్న గడ్డిలో సగం మేసినా సగంమేయకుండా వుంచిన గడ్డి బళ్ళల్లో సర్ది ఎక్కికూర్చున్నాం.

ఇక కంటి అయ్యన్న చెరువు వచ్చిందయ్యా! అదో పరువు పరుగెత్తిస్తూ ఎడ్లు బళ్ళను వద్దన్న వేగంగా లాక్కు వెళ్ళాము. కంటిఅయ్యన్న చెర్వు ఆవేళ ఏదో మైదానం అయి యుంది. సవారిబళ్లు బాహాటంగా పరుగుమీద వెళ్ళే నున్నదనంలు ఏర్పడివుంది. రోడ్డుదారిని మారి ఆదారి పుచ్చుకున్నాం. ఒక్క లిప్తలో వెళ్ళినట్టు వెళ్ళిపోయినాం, మా సవారిబళ్ళను గంటలు వాయించుకుంటూ మువ్వలచప్పుడు చేస్తూ శ్రీరంగపట్నం సాయంత్రం చుక్కలు పొడిచేసరికి—

అది వొకసరదా! అది వొక హుషారు!

.... .... .... .... ....

## మా సందు

"మా సందు" అని ఈ వ్యాసము ఎత్తుకోవడంలో, వెన కెప్పుడో 26-12-12 న రచించిన "కల" అనే నా ఖండకావ్యము నందలి ఒకానొక యుత్పలమాల జ్ఞాపకం వస్తోంది!—

"బందము చేతఁబట్టుకొని పాల్పితుకంగను వెళ్ల గొల్లనిన్
బొందుగ దూడలన్ గదలిపోవక యుండఁగఁ బట్టు పిల్లనిన్
దొందఱతోడ గోవులను దోలఁగ మేల్కొను పాలికాపు మా
పందునఁ బోవుటల్ కనుచు సంతసమెచ్చుగఁ బల్కరించితిన్"

ఆ సందునే మా యూరిలో "కవుకొండలవారి సందు" అంటారు. "సందు" అని ఎప్పుడైతే అన్నామో, దాన్ని వొక దారిగాను, గమ్యస్థానం గలదిగాను, నిరూపించేశాం అన్నమాటే.